# సమన్వయంతో పనిచేయాలి



ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డిని సన్మానిస్తున్న అధికారులు, ప్రజాప్రతినిధులు

- **ప్రజాప్రతినిధులు, అధికారులు పరస్పరం సహకరించుకోవాలి**
- **నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి**
- **కౌడిపల్లి మండల సాధారణ సర్వసభ్య సమావేశం**

కౌడిపల్లి, డిసెంబర్ 18: ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేసి గ్రామాల అభివృద్ధికి కృషి చేయాలని నర్సాపూర్ ఎమ్మెల్యే సునీతాలక్ష్మారెడ్డి సూచించారు. సోమవారం కౌడిపల్లి మండల ప్రజాపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ఎంపీపీ రాజునాయక్ అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఎమ్మెల్యే సునీతారెడ్డి మాట్లాడుతూ అధికారులు. ప్రజాప్రతినిధులు సమన్వయంతో పని చేసినప్పుడే గ్రామాలు అభివృద్ధి బాటలో పయనిస్తాయన్నారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యల పరిష్కారం కోసం క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆమె ఆదేశించారు. అభివృద్ధి పనులకు సంబంధించిన బిల్లులను తప్పకుండా ఇప్పిస్తానని సర్పంచులకు సునీతారెడ్డి హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేగా మొదటి సర్వసభ్య సమావేశానికి హాజరైన సునీతా లక్ష్మారెడ్డికి వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు నాయకులు, గజమాలతో వేసి శాలువాలతో ఘనంగా సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో జడ్పీటీసీ సభ్యురాలు కవిత అమర్ సింగ్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్రాగౌడ్, ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ ఆంజనేయులు, రైతు సమన్వయ సమితి మండల అధ్యక్షుడు సార రామాగౌడ్, పీఆర్‌డీ అమరేశ్వర్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు ప్రవీణ్ కుమార్, ఎంపీటీసీలు, ఆయా గ్రామాల సర్పంచులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# నాపై ఆరోపణలు రాజకీయ కుట్రే..

## దళితబంధు పంపిణీలో కమీషన్లు అవాస్తవం

- **అధికార పార్టీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తున్నది**
- **లై డిటెక్టర్ పరీక్షకూ సిద్ధం**
- **కాంగ్రెస్ భౌతికదాడులకు పాల్పడుతున్నది**
- **బీఆర్ఎస్ హయాంలోనే అన్ని వర్గాలకు న్యాయం**
- **అందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్**



టేక్మాల్/మెదక్ అర్బన్, డిసెంబర్ 18: 'బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లు ప్రజలకు ప్రజారంజకంగా పరిపాలన అందించింది. దళితుల అభివృద్ధి కోసం ప్రవేశపెట్టిన దళిత బంధు పథకంలో కమీషన్లు తీసుకున్నానని అధికార పార్టీ నాపై ఆరోపణలు చేయడం సమంజసం కాదు.' అని ఆందోల్ మాజీ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ అన్నారు. దళితబంధు మంజూరు కోసం తాను డబ్బులు తీసుకున్నానని టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లో ఓ వ్యక్తి ఫిర్యాదు చేసినట్లు వస్తున్న వార్తలపై ఆయన స్పందించారు. టేక్మాల్ మండలంలోని పల్వంచ గ్రామానికి చెందిన పల్వంచ భూమయ్య అనే వ్యక్తి నుంచి దళితబంధు పంపిణీ కోసం తాను డబ్బులు తీసుకున్నట్లు వస్తున్న వార్తలు అవాస్తవమన్నారు. గత ఐదేండ్లలో తాను ఎలాంటి అవినీతికి పాల్పడలేదని, కేవలం జీతం తీసుకుని ప్రజల సేవ చేశానని, నాతో పనిచేసిన ప్రతి ఒక్కరికీ ఈ విషయం తెలుసన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు తన దృష్టికి వచ్చిందని, ఇందులో రాజకీయ కుట్ర దాగివుందని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ఆరోపణలపై నిజాలను నిగ్గు తేల్చేందుకు లై డిటెక్టర్ పరీక్షకు కూడా తాను సిద్ధమేనన్నారు. తనపై తప్పుడు ఫిర్యాదు చేసిన వ్యక్తికి కూడా లై డిటెక్టర్ పరీక్షలు నిర్వహించి వాస్తవాలను వెలుగులోకి తేవాలన్నారు. అందోల్ నియోజకవర్గంలో మంత్రి దామోదర రాజనర్సింహ చేస్తున్న అరాచకాలకు ఈ ఫిర్యాదు పరాకాష్ట అన్నారు. తప్పుడు కేసులతో బీఆర్ఎస్ కార్యకర్తలను వేధిస్తున్నారని, వారి ఇండ్లపై దాడులు కూడా చేస్తున్నారని మండిపడ్డారు. ఇండ్లల్లోకి చొరబడి మహిళా కార్యకర్తలపై కోడిగుడ్లతో దాడులు చేస్తున్నారని, నాయకుల ఇండ్లపై పటాకులు పేలుస్తూ భయభ్రాంతులకు గురిచేస్తూ దామోదర రాజనర్సింహ అనుచరులు రాక్షసానందం పొందుతున్నారన్నారు. గ్రామస్థాయి అధికారులను తమ దారిలోకి తెచ్చుకునేందుకు అధికార పార్టీ నాయకులు బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆరోపించారు. రాజకీయంగా తనను బద్నాం చేయడమే లక్ష్యంగా ప్రలోభాలకు గురిచేసి కొందరిని లోబర్చుకుని రాజకీయాలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నిష్పక్షపాతంగా విచారణ జరిపించి నిజాలను నిగ్గు తేల్చాలని క్రాంతికిరణ్ డిమాండ్ చేశారు.

### తప్పుడు ఆరోపణలు

దళిత బంధు వ్యవహారంపై తమపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మాజీ ఎమ్మెల్యే క్రాంతికిరణ్ తమ్ముడు రాహుల్ కిరణ్ సోమవారం మెదక్ జిల్లా అదనపు ఎస్పీకి ఫిర్యాదు చేశారు. తమను బద్నాం చేసేందుకు దామోదర రాజనర్సింహ తన అనుచరులను రెచ్చగొట్టి గొడవలు సృష్టిస్తున్నారని ఫిర్యాదు చేశారు. అంతకు ముందు టేక్మాల్ పోలీస్‌స్టేషన్‌లోనూ తమకు బెదిరింపు ఫోన్లు వస్తున్నాయని ఫిర్యాదు చేశారు.

# ధనుర్మాస వ్రతం పుణ్యఫలం


## ధనస్సులో సూర్యుడుండే కాలమే ధనుర్మాసం

### ఈ నెల 16 నుంచి జనవరి 14వరకు ధనుర్మాసం

ఈ నెల 16న అర్ధరాత్రి ధనుర్మాసం ప్రారంభమై 2024 జనవరి 14 ముగుస్తాయి. అంటే మకర సంక్రాంతికి ముగుస్తుంది. ధనుర్మాసాన్ని శూన్యమాసంగా పిలుస్తారు. ఎందుకంటే సాధారణంగా దైవికమైన, పవిత్రమైన కార్యక్రమాలను తప్ప మరేదైనా నిర్వహించకూడదని పండితులు చెబుతున్నారు. ధనుర్మాసం సాధారణంగా డిసెంబర్ మధ్యలో ప్రారంభమవుతుంది. ఈ మాసాన్ని సాధారణంగా పూజా మాసంగా పరిగణిస్తారు. ఈ మాసంలో 23న ముక్కోటి ఏకాదశి, ఉత్తర ద్వార దర్శనం, గీతాజయంతి, 26న దత్తాత్రేయ జయంతి, 30న సంకష్టహర చతుర్ధశి, జనవరి 4న కాలబైరవి జయంతి తదితర పర్వదినాలు వస్తుండడం విశేషంగా చెప్పుకోవచ్చు.



లద్నూర్ గ్రామంలోని రామాలయం



లద్నూర్‌లో కొలువుదీరిన సీతారామచంద్ర, లక్ష్మణమూర్తులు

- **విష్ణువుకు అత్యంత ప్రీతికరమైన మాసం**
- **ఈ మాసంలో ఎన్నో ఆధ్యాత్మిక ప్రయోజనాలు**
- **ఆలయాల్లో తిరుప్పావై పఠనం, గోదా కల్యాణం**
- **ఈ నెల 16 నుంచి జనవరి 14వరకు ధనుర్మాసం**
- **ఈ మాసంలోనే ముక్కోటి ఏకాదశి, గీతాజయంతి పర్వదినాలు**
- **భక్తులతో కిటకిటలాడుతున్న వైష్ణవ ఆలయాలు**

మెదక్, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ)/ మద్దూరు (ధూళిమిట్ట), డిసెంబర్18: కాలాన్ని కొలిచేందుకు మనం అనేక కొలమానాల్ని వాడుతాం. వాటిలో చాంద్రమాన, సౌరమానాలు ముఖ్యమైనవి. చంద్రుడు ఏ నక్షత్రంలో ఉంటే దాన్నిబట్టి చాంద్రమానం లెక్కిస్తారు. సూర్యుడు ఒక్కో రాశిని దాటడాన్ని బట్టి సౌరమాన్ని లెక్కిస్తారు. సూర్యుడు రాశిలోకి ప్రవేశించిన సమయాన్ని సంక్రమణం అంటారు. ఆయా రాశుల్లో సూర్యుడు సంచరించే కాలమును సౌరమాసం అంటారు. ఉదాహరణకు కర్కాటంలో సూర్యుడు ప్రవేశించే సమయం కర్కాటక సంక్రమణం అంటారు. కర్కాటక రాశిలో సంచరించే కాలం కర్కాటక మాసం అంటారు. సూర్యుడు ధనస్సురాశిలో ప్రవేశించిన సమయం ధనుస్సు సంక్రమణం అంటారు. మార్గశిర మాసంలో ధనురాశిలోకి సూర్యుడు ప్రవేశించి, మకర రాశిలోకి సాగే కాలాన్ని ధనుర్మాసం అంటారు. మాసాల్లో మార్గశిరం తానేనని శ్రీ కృష్ణుడు భగవద్గీతలో మార్గశిర మాసం యొక్క విశిష్టతను చెబుతాడు. ధనుర్మాసం ప్రాతఃకాలమువలె పవిత్రమైనది. సాత్వికమైన ఆరాధనలకు ప్రధానమైనది. కనుక సత్వగుణ ప్రధానమైన విష్ణువును ఈ నెలలోఆరాధిస్తారు. ఈ నెల విష్ణుమూర్తికి ప్రీతికరమైనది. గోదాదేవి కథ ఈ మాసమునకు సంబంధించినదే. సూర్యుడు ధనురాశిలో ప్రవేశించడాన్ని 'పండుగ నెలపట్టడం' అని కూడా అంటారు. ఈ నెల రోజులు ఇంటి ముందు పండుగ హడావుడిని గుర్తుచేస్తూ నాలుగు వీధుల చిహ్నంగా ముగ్గును తీర్చిదిద్దుతారు. అయితే ఈ ధనుర్మాసం సౌరమానానికి సంబంధించినది. కానీ తెలుగు వాళ్లంతా చాంద్రమాన అనుయాయులు కాబట్టి దీనికి గుర్తుగా ఈ ముగ్గు మధ్యలో చంద్రున్ని తీర్చిదిద్దుతారు.

### ధనుర్మాసంలో ఆధ్యాత్మిక ప్రయోజనాలు

కార్తిక మాసం, మాఘమాసం, శ్రావణ మాసం.. ఇలా ఈ నెలలకు మాత్రమే ఎక్కువ ప్రాధాన్యం ఉందని చాలా మంది భావిస్తారు. కానీ..ధనుర్మాసం కూడా చాలా ఆధ్యాత్మిక ప్రయోజనాలు కలిగిన నెల అని చాలా మందికి తెలియదు. ఈ నెలకు కూడా చాలా ప్రత్యేకత ఉంది. ధనుర్మాసమంతా.. ఉదయం సాయంత్రం ఇల్లు శుభ్రం చేసి..దీపారాధన చేయడం వల్ల మహాలక్ష్మి కరుణ, కటాక్షాలు సిద్ధిస్తాయి. ధనుర్మాసం విష్ణువుకి చాలా ప్రత్యేకమైనది. తిరుమలలో ఈ ధనుర్మాసం రోజుల్లో సుప్రభాతం బదులు తిరుప్పావై గానం చేస్తారు. విష్ణువు ఆలయాల్లో ఉదయం అర్చనలు చేసి నివేదనలు చేసి వాటిని పిల్లలకు పంచుతారు. ఇలా చేయడాన్ని బాలభోగం అంటా రు. ధనుర్మాసం దేవతలకి బ్రహ్మీ ముహూర్తంలాంటిది. ఈ మకర, కర్కాటక సంక్రాంతులలో స్నాన, దాన, హోమ, వ్రత పూజలు చేయడం చాలా మంచిది.



బైరాన్‌పల్లి ఆంజనేయస్వామి ఆలయంలో భగవన్నామస్మరణ చేస్తున్న భక్తులు

### ధనుర్మాసానికి ఎందుకింత ప్రత్యేకత?

ధనుర్మాసం వచ్చిందంటే.. ఆలయాల్లో పండుగ వాతావరణం నెలకొంటుంది. విష్ణుమూర్తికి ప్రీతికరమైన మాసం కావడం వల్ల వైష్ణవులు ధనుర్మాస వ్రతం ఆచరిస్తారు. గోదాదేవి ధనుర్మాసమంతా విష్ణు వ్రతం చేపట్టి, స్వామిని కీర్తించింది. సూర్యాలయాలు, వైష్ణవాలయాలు సందర్శించడం చాలా మంచిది. ధనుర్మాసం అంటే దివ్య ప్రార్థనకు అనువైన మాసమని అర్థం. ధనుర్మాసం తెలుగు సంస్కృతిలో ఒక భాగం దేవాలయాల్లో ఆండాళమ్మ పూజ, తిరుప్పావై పఠనం, గోదాకల్యాణం మొదలైనవి ధనుర్మాసంలోనే నిర్వహిస్తారు. తిరుమలలో ధనుర్మాసం నెలరోజులు సుప్రభాతానికి బదులు తిరుప్పావై గానం చేయడం చేస్తారు. సహస్రనామార్చనలో తులసీదళాలకు బదులు బిల్వపత్రాలను ఉపయోగిస్తారు. ధనుర్మాసంలో ఉదయం, సాయంత్రం దీపారాధన చేయడం వల్ల లక్ష్మీదేవి అనుగ్రహంతో పాటు, దరిద్రం దూరమవుతుంది. ఈ నెలలో ప్రతి రోజూ బ్రాహ్మీ ముహూర్తంలో పారాయణం చేసిన వారు దైవానుగ్రహానికి పాత్రులవుతారని ప్రతీతి. ఆ భూదేవి, అవతారమైన ఆండాల్ రచించిన దివ్య ప్రబంధమే తిరుప్పావై. ద్రావిడ భాషలో తిరు అంటే పవిత్రమైన పావై అంటే వ్రతం అని అర్థం. ధనుర్మాసంలో విష్ణువును మధుసూదనుడు అనే పేరుతో పూజించి, మొదటి పదిహేను రోజులు చక్కెర పొంగలి లేదా పులగం స్వామికి నైవేద్యంగా సమర్పించాలి. తర్వాత పదిహేను రోజులు దద్యోజనం అర్పించాలి. పెండ్లికాని అమ్మాయిలు ఇంటి ముందు ముగ్గులు గొబ్బిళ్లతో పూజలు చేయడం వల్ల తాము కోరిన వరుడు లభిస్తాడు. గోదాదేవి మార్గశీవ్రతం పేరుతో విష్ణువును ధనుర్మాసమంతా పూజించింది. శ్రీ కృష్ణుడి ధనుర్మాసం నెలరోజులూ తులసీ మాల సమర్పించే యువతులకు, నచ్చిన వరుడితో వివాహం జరుగుతుంది. ధనుర్మాస వ్రతం గురించి మొదట బ్రహ్మదేవుడు నారద మహర్షికి వివరించినట్లు పురాణ కథనం. ధనుర్మాస వ్రతం గురించి బ్రహ్మండ, ఆదిత్య పురాణాల్లో, భాగవతంలో, నారాయణ సంహితలో కనిపిస్తాయి.

ఈ వ్రతం ఆచరించాలనుకునేవాళ్లు తమ స్థోమతను బట్టి విష్ణు ప్రతిమని చేయించి పూజించాలి. ప్రతి రోజూ సూర్యోదయానికి ముందే స్నానాలు పూర్తిచేయాలి. పంచామృతాలతో మహావిష్ణువును అభిషేకించి తర్వాత తులసీ దళాలు, పూలతో అష్టోత్తర సహస్రనామాలతో స్వామిని పూజించి నైవేద్యం సమర్పించాలి. నెల రోజులూ చేయని వాళ్లు 15 రోజులు, 8రోజులు లేదా ఒక్క రోజైనా చేయవచ్చు. ధనుర్మాస వ్రతం చేయడం వల్ల ఇహలోక సుఖాలు, పరలోక మోక్షం పొందుతారు. ఆత్మపరమాత్మను చేరడానికి ఉపకరించేదే ధనుర్మాస వ్రతం. ప్రాచీన కాలం నుంచి భారతీయులందరూ ఈ వ్రతాన్ని ఆచరిస్తున్నారు.



మెదక్‌లోని వెంకటేశ్వరాలయంలో ప్రారంభమైన ధనుర్మాస ఉత్సవాలు

### మెదక్ శ్రీ కోదండ రామాలయంలో..

ధనుర్మాసాన్ని పురస్కరించుకొని మెదక్ జిల్లా కేంద్రంలోని శ్రీ కోదండ రామాలయంలో అర్చకులు శ్రీ భాష్యం మధుసూదన్ చార్యులు, శ్రీ వెంకటేశ్వర ఆలయంలో శ్రీ నరేంద్ర చార్యులు వేకువ జామున స్వామి వార్లకు అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నారు. నెలరోజుల పాటు సుప్రభాతానికి బదులు తిరుప్పావై పఠనం చేస్తూ, అర్థాన్ని, ధనుర్మాసం ప్రత్యేకత, విశిష్టతను భక్తులకు వివరించనున్నారు. ధనుర్మాసమంతా గోదాదేవి(ఆండాళ్) మార్గశివ్రతం పేరుతో విష్ణు వత్రం చేపట్టి స్వామి వారిని కీర్తిస్తారు. భూదేవి అవతారమైన ఆండాళ్ తల్లి రచించిన దివ్య ప్రబంధమే తిరుప్పావై. ద్రవిడ భాషలో తిరు అంటే ప్రవిత్రమైన, పావై అంటే వత్రం అని అర్థం. ఈ మాసంలో వైష్ణవ ఆలయాలను సందర్శించి, ప్రత్యేక పూజలు చేస్తే మంచిదని అర్చకులు చెబుతున్నారు.

### భగవంతుడి సేవలో తరించాలి



ధనుర్మాసం ఎంతో పవిత్రమైనది. విష్ణువుకు అత్యంత ప్రీతికరమైన మాసం. భగవంతుడి సేవలో తరించేందుకు ఈ మాసం అత్యంత అనుకూలమైనది. వైష్ణవ సంప్రదాయస్తులకు ఈ మాసం ముఖ్యమైనది. సూర్యుడు ధనస్సునందు ప్రవేశించిన నుంచి ఉషకాలమందు విష్ణుమూర్తిని పూజిస్తే వెయ్యి సంవత్సరాలు పూజించినటువంటి ఫలం ఒక్క రోజుతో వస్తుందని భాగవతంలో చెప్పబడింది. వైష్ణవ ఆలయాల్లో ప్రతి రోజు తిరుప్పావై, విష్ణు సహస్రనామాలు పఠిస్తే ఎంతో పుణ్యం లభిస్తుంది. ఈ మాసంలో నిరంతరం భగవన్నామ స్మరణ చేయాలి. ఈ మాసంలో వైకుంఠ ఏకాదశి, గీతాజయంతి, దత్తాత్రేయ పర్వదినాలు వస్తుండడం వల్ల ఆయా పర్వదినాల్లో భక్తులు భగవంతుడి సేవలో నిమగ్నమై ఆ భగవంతుడి కృపకు పాత్రులు కావాలి.

–పార్నంది ఆంజనేయశర్మ, పురోహితుడు, బైరాన్‌పల్లి

### ప్రశాంత్‌కు అభినందనలు తెలిపిన హరీశ్‌రావు



బిగ్‌బాస్ సీజన్ ఏడులో విజేతగా నిలిచిన రైతుబిడ్డ పల్లవి ప్రశాంత్‌కు మాజీ మంత్రి తన్నీరు హరీశ్‌రావు అభినందనలు తెలిపారు. సిద్దిపేట జిల్లాకు చెందిన రైతుబిడ్డ విజేతగా నిలువడం సంతోషంగా ఉందని, పొలాల నుంచి బిగ్‌బాస్ హౌజ్‌లో అడుగుపెట్టిన అతని ప్రయాణం ప్రేక్షకుల హృదయాలను గెలుచుకుందన్నారు. ఈ సీజన్‌లో రైతుబిడ్డగా అడుగుపెట్టి సామాన్యుల దృఢ సంకల్పానికి ప్రతీకగా నిలిచారని ట్వీట్ చేశారు.








- **ప్రశాంత్‌ది గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామం**
- **పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికిన గ్రామస్తులు**
- **స్వగ్రామంలో పండుగ వాతావరణం**
- **రైతు బిడ్డ పేరుతో ప్రశాంత్ సామాజిక మాధ్యమాల్లో వీడియోలు**
- **బిగ్‌బాస్ షోలో పాల్గొనే అవకాశం**

# రైతుబిడ్డ.. బిగ్‌బాస్ విజేత

## ఏడో సీజన్‌లో ఎంట్రీ ఇచ్చిన పల్లవి ప్రశాంత్

గజ్వేల్, డిసెంబర్ 18: మూడేండ్లుగా బిగ్‌బాస్‌లోకి అడుగుపెట్టాలనే లక్ష్యం పెట్టుకొని అతడు విశ్వ ప్రయత్నాలు చేశాడు. ఏడో సీజన్‌లో రైతుబిడ్డగా అడుగుపెట్టి మల్లా వచ్చినా..మళ్లొచ్చినా.. తగ్గేదేలే... జై జవాన్ జైకిసాన్ అంటూ డైలాగ్‌లు చెప్పుతూ బిగ్‌బాస్‌లోకి ఎంట్రీ ఇచ్చిన రైతుబిడ్డ పల్లవి ప్రశాంత్ విన్నర్‌గా నిలిచాడు. మూడేండ్లుగా చేసిన ప్రయత్నం ఫలించడంతో ఏడో సీజన్‌లో విజేతగా నిలిచిన రైతుబిడ్డకు అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. స్వగ్రామంలో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, స్నేహితుల మధ్య ఘనం స్వాగతం లభించింది. గజ్వేల్ మండలం కొల్గూర్ గ్రామానికి చెందిన పల్లవి సత్యనారాయణ, విజయ దంపతులకు నలుగురు సంతానం, కూతురు గౌతమి, కుమారులు ప్రశాంత్, మహావీర్, వినయ్ ఉన్నారు. తల్లిదండ్రులు వ్యవసాయం చేసుకుంటూ నలుగురు పిల్లలను చదివించారు. పెద్ద కుమారుడు ప్రశాంత్ డిగ్రీ చదువుతూ మధ్యలోనే ఆపేసి తండ్రి సత్యనారాయణకు వ్యవసాయంలో సాయం చేస్తూ అందులోనే నిమగ్నమయ్యాడు. వ్యవసాయం చేస్తూనే రైతులు పడే బాధలను అందరికీ తెలియజేయాలనే ఉద్దేశంతో వీడియోలు చేసి వాట్సాప్, ఫేస్‌బుక్, సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేసి ఎంతో మంది అభిమానులను సంపాదించుకున్నాడు. బిగ్‌బాస్ షోలో భుజన బియ్యం బస్తాతో అడుగుపెట్టి అందరి మనస్సును గెలుచుకున్నాడు. బిగ్‌బాస్‌లో ప్రతి సందర్భంలో తాను విజేతగా నిలిస్తే తనకు వచ్చే నగదు బహుమతిని రైతులకు అందజేసి వారి కష్టాల్లో పాలుపంచుకుంటానన్నాడు. ప్రతి షోలో రైతుల కష్టాలను తెలియజేస్తూ ప్రేక్షకులతో పాటు షోలో ఉన్న వారి మనస్సును గెలుచుకున్నాడు. ఎప్పుడు సెలబ్రిటీలకే అవకాశం దక్కే బిగ్‌బాస్‌లోకి రైతుబిడ్డ అడుగుపెట్టాడనే సమాచారంతో ఎక్కువ సంఖ్యలో అన్ని వర్గాల ప్రజలు ఆసక్తిగా చూశారు. రైతుబిడ్డగా ప్రేక్షకుల నుంచి ఆదరణ పొందాలని చూస్తున్నడనే విమర్శలు వచ్చినా కుంగిపోకుండా ఆత్మ విశ్వాసంతో నిలదొక్కుకున్నాడు. ఆదివారం జరిగిన గ్రాండ్ ఫినాలేలో సినీ నటుడు, బిగ్‌బాస్ హోస్ట్ నాగార్జున విజేతను ప్రకటించారు. ఫైనల్ టైటిల్ కోసం ప్రశాంత్‌తోపాటు అర్జున్, శివాజీ ప్రిన్స్ యావర్, అమర్‌దీప్, ప్రియాంక పోటీలో నిలిచారు. నలుగురు ఎలిమినేట్ కాగా అమర్‌దీప్, ప్రశాంత్ మధ్య ఆఖరి పోటీ ఏర్పడింది. ప్రేక్షకుల ఓట్లు, షోలో అత్యుత్తమ ప్రదర్శనతో ప్రశాంత్‌ను హీరో నాగార్జున విజేతగా ప్రకటించారు. అంతిమ విజేతగా నిలవడంతో పాటు రూ.35 లక్షల నగదు, కారు, రూ.15 లక్షల విలువైన బంగారం దక్కించుకున్నారు.



గజ్వేల్‌లో ప్రశాంత్‌కు ఘనంగా స్వాగతం పలుకుతున్న అభిమానులు

### సొంత గ్రామంలో ఘనస్వాగతం

బిగ్‌బాస్ విజేత పల్లవి ప్రశాంత్‌కు సొంత గ్రామం కొల్గూర్‌లో కుటుంబ సభ్యులు, గ్రామస్తులు, స్నేహితుల మధ్య సోమవారం సాయంత్రం ఘనస్వాగతం లభించింది. గజ్వేల్ మండలం ప్రజ్ఞాపూర్ నుంచి గజ్వేల్ వరకు ర్యాలీతో చేరుకున్న ప్రశాంత్‌కు దారి పొడవునా స్వాగతం పలికారు. కొల్గూర్‌లో బ్యాండ్ మేళ, డీజేల మధ్య డ్యాన్స్‌లు చేసుకుంటూ గ్రామస్తులు స్వాగతం పలికారు.

### గెలిపించిన వారందరికీ ధన్యవాదాలు

బిగ్‌బాస్ సీజన్ ఏడులో విజేతగా నిలిచా. నన్ను విజేతగా గెలిపించిన అందరికీ ధన్యవాదాలు. నగదు బహుమతిని రైతుల కోసమే వినియోగిస్తా. రైతుల మద్దతుతో గెలుపొందడం సంతోషంగా ఉంది. గెలుచుకున్న కారు నాన్నకు, నెక్లెస్‌ను అమ్మకు ఇస్తా.

– పల్లవి ప్రశాంత్